# బురద

**మే**న్‌రోడ్డు మీద దాదాపు అర కిలోమీటరు దాకా లారీలు ఆగి ఉన్నాయి. లారీల చుట్టూ అక్కడక్కడ తోపుడు బళ్లమీద ఆమ్లేట్లు, రొట్టెలు అమ్ముతున్నారు. రోడు పక్క నేల బురదతో చితచితలాడుతోంది. చాయ్ హోటల్లల్లో జిడ్డోడే క్లీనర్లు అటిటు తిరుగుతున్నారు. ఒక విధమైన కంపు వాసన వాతావరణంలో నిండిపోయింది. చేసేదేమి లేక లారీల కాబిన్లల్లో అడ్డదిడ్డంగా పడి కొందరు డ్రైవర్లు నిదురపోతున్నారు. అరుపులు కేకలతో, తిట్లతో అక్కడ గజిబిజిగా ఉన్నది.

రోడ్డుకి కుడిపక్కనేగల గవర్నమెంటు హాస్పిటల్ ఆవరణ బురద నీటితో నిండిపోయి ఉన్నది. కప్పులు ఎడతెగని విధంగా అరుస్తున్నాయి. వీధిలైట్లు గుడ్డిగా మసకగా వెలుగుతున్నాయి.

అలాంటి తొక్కిడితో మనుషులు దయ్యాల్లాగా అటు యిటూ తిరుగుతున్నారు. అరుస్తున్నారు. తింటున్నారు. సారా పొట్లాలు తాగుతున్నారు.

“తెరిమాకా కిరికిరి అరె హుస్సేన్ లైన్ క్లియరయ్యిందారా?” ఒక లారీలో నుండి ఒక డ్రైవర్ ఆవులిస్తూ కేకేశాడు.

“లేదన్నా!” లారీ కిందినుండి క్లీనర్ కేకేశాడు.

“పొద్దటి నుంచి ఈ ముసుర్ల సచ్చుడైతంది. సింగిల్ రోడ్డు ఈ లైన్‌కు బండి కొట్టద్దురా నా కొడుక! అంటే ఓనరుగాడినడు.” డ్రైవర్ పరపరలాడే డోరు తెరిచి కిందికి దిగుతూ.

ఆ రోడ్డుకిరువైపుల పెద్దపెద్ద సిమెంటు బిల్డింగులున్నాయి. ఆ బిల్డింగుల్లో చివరది గవర్నమెంటు దవాఖానా. దాని కాంపౌండునానుకొని చాలరకాల చిల్లర బేరాలు కొనసాగుతూనే ఉన్నాయి. దవాఖానకు ఎడంగా బస్ షెల్టర్‌లో చివరకు ఇద్దరే మనుషులు మిగిలిపోయారు.

పెచ్చులూడిన సిమెంటు బెంచీ చివరకు ఒక పడుచువాడు కూర్చున్నాడు. అతని వయస్సు ఇరువైలోపే - కానీ అంతకన్నా చిన్నవాడిలాగా కన్పిస్తున్నాడు. నల్లటి ముఖం- మిలమిలలాడే కళ్లు- అతను అసహనంగా బీడి మీద బీడి తాగుతూ కూర్చున్నాడు. అతని కాళ్ల దగ్గర బొత్తిగా నడవడానికి ఓపికలేని కుక్క ఒకటి ముడుచుక పడుకున్నది. సిమెంటు బెంచీ కింద పిచ్చి వాడెవడో పోగు చేసుకున్న గుడ్డల మూట ఉన్నది.- అదే బెంచీకింద కొంచెం దూరంలో గోనె సంచిలో ప్యాకు చేసిన రెండు అట్ట డబ్బాలున్నాయి. “తను అనుకోకుండా ఇరుక్క పోయిండు.

వేరే దారి లేదు. తప్పదు. కత్తి అంచు మీద నిలబడ్డప్పుడు...” అగులు బుగులుగా ఆ అబ్బాయి లేచి నిలుచున్నాడు. అతనికి వికారంగా ఉన్నది. అతను వేసుకున్న బట్టలు అతనివి కానట్టు లూజుగా ఉన్నాయి.

అదే షెల్టర్‌లో సిమెంటు బెంచీకి రెండవ చివర మురికి గుడ్డలతో నల్లగా, మురికి మురికిగా, సొంతం వర్షంలో తడిసి ముద్దయినట్టు, దుఃఖంలో నానిపోయినట్లు, తుఫాను గాలిలో తప్పిపోయి వానలో తడిసిన అడివి పావుర్రంలా ఒక స్త్రీ కూర్చుండి ఉన్నది. అక్కడ అంతటి లొల్లి జరుగుతున్నా ఏ లోకంలోనో ఉన్నట్టు కదలక మెదలక కూర్చుండి ఉన్నది. ఆమె ముఖం లేతలేతగానే ఉన్నా వడలిపోయి ఉన్నది. ఆమె చేతుల్లో పుట్టి వారమన్నా గడువని పసిగుడ్డు ఉన్నది. పసిగుడ్డుకు తొడిగేందుకు బట్టలేమి లేనట్టే ఉన్నది. ఎక్కడిదో మాసిన పేగు అడ్డదిడ్డంగా కప్పి ఉన్నది. ఆ స్త్రీ పేదపేదగా దీనంగా ఉన్నది. దొంగలు దోచిన ఊరులా ఆమె శరీరం ఉన్నది. దిక్కులేక అల్లాడే అనాథకు ఆ పసిగుడ్డు గుదిబండలాగున్నది.

ఆ యువకుడు ఆ స్త్రీ సిమెంటు బెంచీ రెండు చివరలకు చెరోపక్క కూర్చుండి పొద్దటి నుంచి ఒక్కమాటన్నా మాట్లాడుకోనేలేదు. ఆ స్త్రీ బండబారిపోయినట్లు, సకల చేష్టలుడిగి పోయినట్లు కూర్చున్న జాగాలో నుండి కదలకమెదలక కూర్చున్నది. పసిగుడ్డుకు యాంత్రికంగా పాలు కుడుపడం తప్ప చేతులు కూడా కదుపకుండా అట్లాగే కూర్చున్నది. మధ్యమధ్య వీచే తడిగాలి. కురిసే వానజల్లు. తడి గాలికి శిసువు కేర్ మంటోంది. ఎవరికెవరు పట్టని కోలాహలంలో ఆ యువకుడు ఆమె ముఖంలో మారే అనేక భావాలను పసికట్టాడు. అతనికి అంతా అర్థమౌతూనే ఉన్నది. కానీ ఆ స్త్రీకే తట్టని పరిష్కారం అతనికెట్లా తడుతుంది.

లారీల పక్కనుండి ఇద్దరు జిడ్డోడే క్లీనర్లు ఆ షెల్టరులోనికి వచ్చారు. సారా వాసన గుప్పుమన్నది.

ఆ యువకుడికి అదీ అర్థమౌతూనే ఉన్నది. ప్రపంచం యావత్తు అమ్మడం కొనడంలోనే తచ్చాడుతోంది. చేతగాని కోపం అతని ముఖంలో– అక్కడి నుండి లేచి పోయి కొంచెం దూరంలో గల వేప చెట్టు కింద నిల్చున్నాడు. వేప చెట్టు చిత్రమైన ధ్వనితో కనలికనలి రోదిస్తున్నట్టుగానే తడితడిగా ఆకులనూపుతోంది.

ఇలాంటి రోతను తను భరించలేడు. కడుపులో పేగులు మెలి తిరిగిపోతాయి. ఈ రోత భరించలేకనే కదా! తను... వద్దు. అలాంటి జ్ఞాపకాలు వద్దు. గతాన్ని తవ్వుకొని తవ్వుకొని ఆ మట్టిలో కప్పుకపోవద్దు. ఏది ఏమన్నా కాని... ఏటికి ఎదురెక్కే చేపలాగే బతుకాలి.

“అరే బాడ్‌కావ్ రాత్రి తొమ్మిదైంది ఏడ సచ్చినవ్‌రా?” ఒక లారీ డ్రైవరు అరుస్తున్నాడు. ఆ పక్కనే కోడిగుడ్డు అట్టు సువ్వున పొంగింది. ఆ పక్కనే పందిలాంటి వాడొకడు సప్ప సప్ప ఏదో నములుతున్నాడు.

వీధిలైట్ల సుట్టు ఏవో పురుగులు తిరుగుతున్నాయి.

ఏదన్నా తింటే బావుండును. తను ఇరుక్కుపోయాడు. పడమటి రోడ్డు ఇక్కడికి పది కిలోమీటర్లకు ఆవల. రోడ్డు సుమారు ముప్పై గజాలు వరదకు కొట్టుకపోయింది. ఇసుక బస్తాలు పేరుస్తున్నారట. ఎప్పుడైనా క్లియర్ కావచ్చును... రోడ్డ బాగయినా కూడా నిలిచిపోయిన లారీలన్నీ దాటేసరికి....

వద్దనుకుంటూనే ఆ యువకుడు బస్ షెల్టర్‌కేసి చూశాడు. ఆ స్త్రీ క్లీనర్ యిచ్చిన మురికి గుడ్డలో పసికందును పడుకోబెట్టింది. వాళ్లిద్దరు, ఆ స్త్రీ చీకట్లో కలిసిపోయారు.

ఆ యువకుడు రుసరుసలాడాడు. పరుగెత్తి వాళ్ల ముగ్గుర్ని తన్నాలన్నంత ఉద్వేగం కల్గింది. తల పట్టుకొని వేప చెట్టు మొదట్లో కూలబడ్డాడు. అతని మనుసులో గుడిసె. తండ్రి ముఖం మాడ్చుకొని మునిమాపువెల్లితే – తమ ఇంట్లో.... అమ్మ.... తనను గుడిసె బయటకు వెళ్ళగొట్టి – ఆ తరువాత గుడిసెలో నుండి వెళ్లిపోయేవాని వెంటబడి కొరుకాలన్నంత కోపం.

ఆ యువకుడి మెదడు కమ్మరి కొలిమిలా మండుతోంది... బతుకు ఎంత దుర్మార్గమైందో? ఆ దుర్మార్గాన్ని భరించడం ఎంత యాతనో అతను అనుభవించినట్లుగానే ఉన్నడు.

అమ్మ మంచిదా? చెడ్డదా? ఇప్పటికీ అర్థం కాలేదు. ఆ ఆలోచన పక్కకు నెట్టాడు. తనకు పసందైన తాడి చెట్లమీద వర్షపు చప్పుడు గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేశాడు. ఏట్లో తండ్రితో చాపలు పట్టడం. "నువ్వు గియ్యాన్ని మనసులో పెట్టుకోకుర. తెనుగోని బతుకు తెగిపోయిన బతుకు. మనకు భూములా జాగలా? భూములు జాగలున్నోల్లే మన్నైపోతండ్లు. మనం వానాకాలంల జిమ్మలు (చేపలు) పట్టుకొని బతుకాలె – అయి ఇల్లిల్లు దిర్గి అమ్ముకోవాలె- కాయగసరు కాలంల అయ్యి అమ్ముకోవాలె- ఈ ఊళ్లె బతుకాల్నంటె సేపపిల్లతీర్గ కై నెరిగి బతుకాలే." తండ్రి మాటలు... దుర్భరమైన ఆకలి.

యువకుడు ఇలాంటి ఆలోచనలను దూరం కొట్టడానికి లేచి ముందుకు నడిచి ఒక గుడిసె హోటల్లో దూరి వేడి వేడి ఛాయ్ తాగి ఒక బన్ తిన్నాడు. తను ఇంటి నుంచి పారిపోయిన రోజు గుర్తొచ్చింది. ఎందుకో కళ్లల్లో నీళ్లూరినయ్.

హొటల్లో బూతు మాటలు, సారా వాసన భరించలేకపోయాడు.

ఆ యువకుడు కౌంటర్ వద్దకు నడిచి ఒక గ్లాసు, ఒక బన్ను కొన్నాడు. అందులో టీ తీసుకున్నాడు. హాస్పిటల్ దగ్గర కనుక గ్లాసులు అమ్మడం ఆ హోటలాయనకు మామూలే. చాయ్ తీసుకొని బసు షెల్టర్ దగ్గరికి వచ్చేసరికి పసిగుడ్డు చలికి గజ గజలాడుతూ సన్నగా పీలగా ఏడుస్తోంది. ఆ ఏడుపును ఎవరూ పట్టించుకోవడం లేదు. టీ బెంచీమీద పెట్టి పసిగుడ్డును చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ ఏడుపు తనకు చిరపరిచయం లాగా ఉన్నది. ఎర్రగా మాంసం ముద్ద. యువకుడి చేతుల వెచ్చదనానికి ఆ శిశువు ఏడుపు మానింది. ఆ స్త్రీ ఎక్కడికి వెళ్లిందో అర్థమౌతూనే ఉన్నది. కడుపులో దేవినట్టయింది. మనుసు పొరల్లో ఏదో కరుగుతోంది.

యువకుడు తలెత్తి చూసేసరికి ఎదురుగా ఒక పోలీసు, ఒక హెూంగార్డు నిలుచున్నారు. వాళ్లు అక్కడున్న రెండు మూటలను కాలితో తన్ని "ఈ మూటలు నీయేనా?" పోలీసు.

"కాదు"

"మరెవలయి?" హెూంగార్డు.

"ఇందాక ఈడనే ఉండేసార్! చాయ్ తాగస్తనని పోయిండు. నన్ను చూడమన్నడు సార్ పిల్చుక రమ్మంటారా?"

"నువ్వెందుకు ఈడ కూసున్నవ్ బే?"

"మా అక్క సర్కారు దవాఖాన్ల ఆరం కింద పసిద్దయ్యింది సార్! మా అక్కను దవాఖాన్ల నుంచి ఇయ్యల్లనే పొమ్మన్నరు సార్! బస్సులు లేక"

"మీ అక్కేది?"

"మంచినీళ్ల కోసం పోయింది సార్."

వాళ్లు ఏమనుకున్నారో ఏమో ఎట్లా వచ్చినవాళ్లు అట్లాగే వెళ్లిపోయారు.

ఆ యువకుడు పొడుగ్గా గాలి పీల్చిండు. అంత చలిలో అతనికి చెమట పట్టింది. ఆ అట్ట పెట్టెలతో తను పట్టుబడితే.... తన బతుకు ఆఖరు....

మరి కాసేపటికి ఆ స్త్రీ బురద కొట్టుకపోయి చింపిరి జుట్టు రేగి వచ్చింది. లైటు వెలుతురులో ఆమె సొలుగుతుండడం కన్పించింది.

యువకునికి ఆ స్త్రీ ముఖంలో ఏమున్నదో మసక వెలుతురులో కనిపించలేదు. పసికందును బెంచీమీద పడుకోబెట్టాడు. ఆ స్త్రీ పసికందు ఏడుస్తున్నా పట్టించుకోకుండా కాసేపు మట్టిముద్దలా కూర్చున్నది.

ఆ యువకుడు వనికే చేతులతో టీ గ్లాసు, బన్ తెచ్చి బెంచీ మీద ఆమె పక్క నుంచాడు. "తుఁ నీకు కావాల్నారా కుక్కా!" ఆ స్త్రీ అది ఏడుపో, కోపమో తెలియని కంఠంతో. ఆ కంఠంలో మానవులందరిని శపిస్తున్న ధ్వని.

"కాదక్కా తిను."

అక్కా... ఆ మాటకు ఆ మట్టిముద్ద కరిగింది. ఆ పసికందును ఒళ్లోకి తీసుకున్నది. రొమ్ము నోట్లో పెట్టింది. ఆకలితో ఉన్న కుక్కలాగా ఆ బన్ తినేసింది.

భరించలేక ఆ యువకుడు లేచి వెళ్ళి వేప చెట్టుకింద నిలుచున్నాడు. లారీల వాళ్ల కేకలు వినిపిస్తున్నాయి. లారీల కైనీడల్లో ఆ స్త్రీ లాంటివాళ్లు చాలామంది తచ్చాడుతున్నారు. క్లీనర్లు ఆ స్త్రీలను ఎక్కడెక్కడో తడుముతున్నారు.

తను చూస్తున్న ఈ ప్రపంచం ఆ యువకునికి కొత్త. గాలి తడిగా వీస్తోంది. దూరంగా ఎక్కడో కప్పలు విసుగు విరామం లేకుండా బెకబెకలాడుతున్నాయి. తూరుపు వెళ్లే బస్సొకటి లారీల మధ్య నుండి ఈడుస్తూ వెళ్లిపోయింది.

ఆ స్త్రీ పసికందునెత్తుకొని వచ్చి ఖాళీ గ్లాసు యువకునికి ఇవ్వబోయింది.

"అక్కడే పెట్టక్కా- నేను కొనక్కొచ్చిన."

ఆ స్త్రీ వెనక్కు వెళ్లిపోయి బెంచీ చివర కూర్చున్నది.

గాలికి వేప చెట్టుమీది నుండి వాన చినుకులు రాలుతున్నాయి. యువకుడు విధిలేక మళ్లీ షెల్టర్‌లోకి వచ్చి కూర్చున్నాడు. ఆ స్త్రీ ముఖం ఇందాక వెలుతురులో చూశాడు. గోండుభాయి ముఖంలాగే ఉన్నది.

"ఏ వూరక్కా!" గోండు భాషలో అడిగాడు.

ఆ స్త్రీ తన వాళ్లెవరో కన్పించినట్టు వ్యాకులపడ్డది.... అక్కడి నుండి లేచి పరుగుత్తాలను కున్నట్లుగా కాసేపు అటిటు మెసిలింది. మళ్లీ ఏమనుకున్నదో?

"ఏ వూరైతే నీకెందుకు?" కోపంగా గోండీలోనే.

యువకుడు మాట్లాడలేదు. "తనకెందుకు? తను ఆమె కన్నీళ్లు తుడ్వగలడా? ఆర్చగలడా? తీర్చగలడా? ఏ వూరైతేంది? అన్ని ఊళ్లు దుంపనాశనమైపోయినంక ఏ వూరైతేంది?"

ఆ స్త్రీ ఇట్లాంటివే ఆలోచనలే చేసిందో? మరేమనుకున్నదో కాని "మాది గుట్టల్ల...గిన్నెధరి కావల..." ఊరుపేరు చెప్పింది.

ఆ యువకుడు తనకు ఆ వూరు తెలుసన్నట్లుగా "ఎంత మంచి ఊరు మీది. చుట్టూ గుట్టలు - పచ్చగా చెట్లు - వాగులు, పిట్టలు, బాయీ"

ఆ స్త్రీ నిట్టూర్చింది. "అన్నీ ఉన్నయిగని బువ్వలేదు."

యువకుడు ఔననలేదు కాదనలేదు. ఇద్దరు మౌనంగా కూర్చున్నారు. ఆమె ఏమనుకున్నదో గురగురగా...

"మోయేడు ఎండకాలంల కరువచ్చింది. మాటి గడ్డలు గునకవిజ్జ (గునుగు గింజలు) తిని బతకలేకపోయినం. ఎక్కడున్నోల్లం అక్కడ సత్తపడ్త బతుకుదామనుకుంటె ఊళ్ల మీదబడి పోలీసులు తిట్టుడు. కొట్టుడు. వశంగాక సినుకుపడ్డంక వత్తమని మా వూళ్లె అందరం ఇటచ్చినం. మా నాయిన, నా పెనిమిటి ఇటు రాలేక జంగల్లకు బోయిండ్లు. ఎటు సాతగాక నేనిటచ్చిన."

పూనకం పూనినదానిలాగా- మూడేండ్ల నుండి మనిషి దొరుకక మాట్లాడని దానిలాగా ఇంకా ఏదో చెప్పాలనుకున్నది కానీ ఆమె గొంతు పూడుకపోయింది. వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"మల్ల నువ్వు ఇంటికి పోలేదా బాయీ! ఇయ్యేడు ఇంటికి గోనెడు జొన్నలు పొరుకల సార్లు పంచినారు గదా!"

"ఈడ ఉండలేక మాపోయిన, సర్కారోల్లు- మా వూరు పీకేసిండ్లు." ఏడుపును ఆపుకోవడానికి ఆ స్త్రీ గొంతునొక్కి పట్టుకున్నది.

ఆ యువకుడు ఏమడుగలేదు. ఒక పెనుతుఫాను ఊళ్లను చుట్టుకపోయి అందులో వేలాది కుటుంబాలు చెట్టుకొకరు పుట్టకొకరు అయిన సంగతి సొంతం తెలిసిన వాడిలాగే ఉన్నాడు....

ఇంకా ఆ స్త్రీ ఏమి చెప్పలేకపోయింది. అలాంటి తుఫానులో కొట్టుకపోయిన వాళ్ల కథలు– గట్టిగ నిలచి పోరాడుతున్న వాళ్ల గాథలు ఎన్నో అతనికి పోటెత్తాయి.

ఆ స్త్రీ ఎప్పటిదో గాయం కెలికినట్టుగా వెక్కివెక్కి ఏడుస్తోంది.

ఇంతలోనే ఇద్దరు ప్రయాణీకులు హాస్పిటల్ గేట్లో నుండి వచ్చారు. ఇద్దరిలో ఒక పురుషుడు రైతులాగా పొట్టిచేతుల అంగి ధోవతి వేసుకున్నాడు. ఇంకొకరు స్త్రీ అతని భార్యలాగున్నది.

"తూరుపుబోయే బస్సు పోయిందా? టైమెంతయ్యిందో? ఆఖరు బస్సు పదింటికి." రైతు.

యువకుడు లేచి టైం కనుక్కు రావడానికి వెళ్లాడు. టైం తొమ్మిదిన్నర. యువకుడు వచ్చేసరికి రైతు భార్య కూడా ఏడుస్తున్నది.

"పిస్సదానా ఏడువకే! కాసినయన్ని కాయలైతయా? పూసిన పూలన్ని పిందెలైతయా? మనరాత గిట్లున్నది. ఊకో! అసలే పచ్చి బాలింతవు. రేప్పొద్దున ఇంటికి పోదామే అంటె ఇనకపోతివి. డాక్టర్ ఆపరేషన్ చెయ్యకపోతే నువ్వు బతికేదానివా? పిల్లలు పుట్టకపోతే మానె నువ్వు దక్కినవ్ అదే పదివేలు." రైతు భార్యను ఓదారుస్తున్నాడు.

అతని భార్య ఆ ఓదార్పుకు ఇంకింత ఏడుపు ఎక్కువ చేసింది.

చలిగాలి రివ్వున వీచింది. బెంచీ చివరన కూర్చున్న గోండుబాయీ చేతుల్లోని పసిగుడ్డు కేర్‌కేర్‌మంటున్నది.

ఇంతలోనే "లైన్ క్లియరయ్యింది." ఎవడో బొంగురు గొంతుతో కేకేశాడు. బెదిరిన చీమల పుట్టలా లారీలన్ని మేల్కొంటున్నాయి. డ్రైవర్లు తాగిన గొంతులతో క్లీనర్లను పిలుస్తున్నారు. క్లీనర్లు సైడుకోసం అరుస్తున్నారు. లారీల ఇంజన్లు రొద పెడుతున్నాయి. చీకటిగా, యాతనగా, బురదగా, రొచ్చురొచ్చుగా ఉన్న ఆ ప్రదేశం ఒక్కసారిగా సందడితో లారీల హెడ్‌లైట్ల వెలుతురుతో నిండిపోయింది. మనుషులు కోలాహలంగా తిరుగుతున్నారు.

ఆ యువకుడు అదిరిపడి లారీలల్లోకి జొరబడి ఒక లారీని మాట్లాడుకున్నాడు. ఆ లారీ క్లీనర్, యువకుడు కలిసి ఆ రెండు అట్ట డబ్బాలు లారీ క్యాబిన్‌లో ఎక్కించారు. లారీ స్టార్టయ్యింది.

లారీ ఎక్కి కూర్చున్న యువకునికి అప్పుడు గోండుబాయీ జ్ఞాపకం వచ్చింది. వస్తే తనతో తీసుకుపోదామనే ఆలోచన మెరుపులా మెరిసింది.

డ్రైవరుకు చెప్పి లారీ కిందికి దిగాడు. బస్సు షెల్టర్ వద్దకు పరుగెత్తాడు. అక్కడ ఎవరూ లేరు. ఆదుర్దాగా వెతుకసాగిండు. లారీ వెనుక బస్సు వచ్చి ఆగింది.

ఇందాకటి రైతు బస్సెక్కి నిల్చున్నాడు. బస్సుకింద ఇద్దరు స్త్రీలు నిలుచున్నారు. బస్సు వెనుక హారన్ కొడుతున్న లారీ లైట్లు వాళ్లిద్దరి మీద పడుతున్నాయి. గోండుబాయి పసిగుడ్డును రైతు స్త్రీ చేతుల్లో పెట్టింది. యువకుడు, గోండు స్త్రీ మొఖంలోకి చూశాడు. గోండుబాయి కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి.

బస్సులో నిలబడిన రైతు జేబులన్నీ వెతికి యాభయి రూపాయల నోటు తీశాడు. గోండుబాయిా ఆ నోటు తీసుకోకుండా తననెవరో తరుముతున్నట్లుగా ఆ లారీలల్లోకి పరుగెత్తింది.

యువకుడు తేరుకొని ఆ స్త్రీ పరుగెత్తిన వైపు పరుగెత్తాడు. వందలాది లారీల మధ్య గోండుభాయి ఎక్కడో మాయమైపోయింది.

"అరె! ఓ జెల్ది రావయ్యా" డ్రైవర్ పిలుస్తున్నాడు. వెనుక నిలబడిన బస్సు, లారీలు అదేపనిగా హారన్లు మోగిస్తున్నాయి.

యువకుడు పరుగెత్తుకొచ్చి లారీలో ఎక్కి కూర్చున్నాడు. పక్కనుండే బస్సు వెళ్లింది. రైతు స్త్రీ పసికందుకు కొంగు కప్పుకొని ఎత్తుకోవడం కన్పించింది. లారీ కదిలింది.

ఆ యువకుడికి ఇదంతా కలో నిజమో తెలియనంత గందరగోళంగా ఉన్నది. దీనంతటికి ఆది అంతం ఎక్కడ? అనే ప్రశ్న ఆ యువకుడి మెదట్లో సుళ్లు తిరుగుతోంది.

❄

శ్వేత రాత్రులు సంకలనం, 1993